క్లుప్తంగా

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన

ఏయూ క్యాంపస్: రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవవైవిధ్య ఉద్యాన వనాన్ని సమత డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. పార్క్‌లోని మొక్కల వివరాలు, విశేషాలను నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు. పుస్తకాలలో చదువుకున్న అనేక రకాల పుష్పాలు, మొక్కలను ఒక్కే చోట చూడడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కృష్ణా కళాశాల ఉద్యోగి వైద్యానికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న జి.ఆదిలక్ష్మికి ఇటీవల సర్జరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఇలా రూ.25 వేలు సేకరించి ఆదిలక్ష్మికి శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి నాగపద్మవల్లి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు కె.రవిబాబు, పోలా ఉమామహేశ్వరరావు, రూపావాణి, తదితరులు పాల్గొన్నారు.

'ఏపీలో నీట్ ఓపెన్ కేటగిరి కోటా పూర్తి చేయాలి'

మద్దిలపాలెం: రాష్ట్రంలో నీట్ ఓపెన్ కేటగిరి పూర్తి చేసి, ఆంధ్రాలో ఉన్న ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్ర విద్యార్థులకు చెందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలానే ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఎంబీబీఎస్‌తో పాటు, పీజీ సీట్లు కూడా రాష్ట్ర విద్యార్థులకు దక్కేలా చూడాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బీచ్ రోడ్డు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ

బీచ్ రోడ్డు: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి నెల రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణకు 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఎండాడలో సిరిగుడి నగర్‌లోని శ్రీసత్యసాయి నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాశ్వత కేంద్రంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాల కోసం 98498 22666 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: BHEEMUNIPATNAM

O.S.617/2022

Between :
Sri Nalla Pentayya and 11 others ...Plaintiffs
And
Smt. Gutta Susrusha ...Defendant

SUMMONS


To, The Defendant:
Smt. Gutta Susrusha,
W/o. Musunuru Satyanarayana, Hindu, aged not known to plaintiffs, R/at 3-B, Friends Court, Pandurangapuram, Visakhapatnam-530003.

Please take notice that the above named plaintiffs have been instituted the above suit against you for cancellation of sale deed and permanent injunction and other reliefs and the suit stands posted to 17-07-2023 for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on 17-07-2023 at 10:30 A.M., in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
L. ARUN KUMAR CHOWDARY
Advocate, Visakhapatnam,
Cell: 9440913741, 8885483965

అభివృద్ధిలో వైఎస్సార్ మార్క్

- మహానేత హయాంలో ఆరిలోవ పరిసరాల్లో బహుళ ప్రాజెక్టులకు నాంది
- విశాఖలో ప్రధాన ప్రాంతంగా వెలుగుతున్న వైనం



ఆరిలోవ హెల్త్‌సిటీలో ఏర్పాటైన కార్పొరేట్ ఆస్పత్రులు

ఆరిలోవ: ఒకప్పుడు తుప్పలు, ముళ్ల పొదలు, లోయలతో వసతుల లేమితో ఉండే ఆరిలోవ ప్రాంతం ఇప్పుడు నగరం చెంతన చేరింది. అది అంతా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలువేనని ఇక్కడి ప్రజల నమ్మకం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరిలోవపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పేద, బడుగు వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చేసిన ఆయన ప్రయత్నం ఫలించింది. అలా కార్యరూపం దాల్చింది విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్). మరో వైపు హెల్త్ సిటీ రూపంలో పలు కార్పొరేట్ ఆస్పత్రులు కొలువుదీరాయి.ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆరిలోవ వైపు నగరంలో అందరి చూపు పడింది.

కార్పొరేట్ ఆస్పత్రులకు కేరాఫ్ హెల్త్‌సిటీ

ఆరిలోవ ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటైన హెల్త్‌సిటీ ఆలోచన వైఎస్ రాజశేఖరరెడ్డిదే. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ ఒకేచోట ఏర్పాటు చేసి హాస్పిటల్ హబ్‌గా తయారు చేయాలని 2007లో ప్రతిపాదించారు. ఇందు కోసం ఆరిలోవ ప్రాంతం పెదగదిలి నుంచి దీనదయాల్‌పురం వరకు 63.21 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించారు. ఆసక్తి ఉన్న ఆస్పత్రుల నిర్వాహకులు ఏపీఐఐసీ నుంచి కొనుగోలు చేయడానికి ముందుకొచ్చారు. ఇలా 28 ఆస్పత్రులకు ఏపీఐఐసీ స్థలాలు కేటాయించింది. 2008లో పెదగదిలి వద్ద హెల్త్‌సిటీకి వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారు. అపోలో, పినాకిల్, క్యూ-1, శుశ్రుత, కేర్, ఎంబీ తదితర ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయి.

బీఆర్‌టీఎస్‌తో ట్రాఫిక్ నియంత్రణ



ఆరిలోవ ప్రాంతం మీదుగా వెళ్తున్న బీఆర్‌టీఎస్ రోడ్డు వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమే. 2008లో ఆయన దీనికి శంకుస్థాపన చేశారు. నగరంలో వాహనాల రద్దీ క్రమబద్ధీకరణ కోసం ఈ కారిడార్‌ను నిర్మించారు. జాతీయ రహదారిని ఆనుకొని హనుమంతవాక కూడలి నుంచి పెదగదిలి, చినగదిలి, ముడసర్లోవ మీదుగా సింహాచలం పాత గోశాల వరకు 11 కిలోమీటర్ల పొడవున ఈ రోడ్డు సింహాచలం కారిడార్ పేరుతో నిర్మాణం చేపట్టారు. ఐదు లైన్లతో నిర్మించిన దీనికి రూ.200 కోట్లు ఖర్చు చేశారు.

ఆరిలోవకు మహర్దశ



వైఎస్సార్ వల్లే ఆరిలోవ ప్రాంతానికి మహర్దశ వచ్చింది. మా కుటుంబం కొన్ని తరాల నుంచి ఈ ప్రాంతంలో నివాసముంటున్నాం. అప్పట్లో ఇక్కడ చిన్న లోయలు, తుప్పలు, వ్యవసాయ భూములు ఉండేవి. ఇటువైపు జన సంచారం కూడా ఉండేదికాదు. అలాంటి ఈ ప్రాంతంలో విమ్స్, హెల్త్‌సిటీ, బీఆర్‌టీఎస్ రోడ్లు రావడంతో కళకళలాడుతుంది. నిత్యం ఇక్కడ జనం, వాహనాలు తిరుగుతున్నాయి. ఇప్పుడు అంతా సందడిగా ఉంది.

– కొల్లి పెద్ద అప్పలనాయుడు, బీసీ కాలనీ, పాత ఆరిలోవ

నగరం చెంతన చేరింది..



ఇక్కడ సౌకర్యాలు లేనప్పుడు ఆరిలోవ అంటే ఎవరికీ తెలిసేదికాదు. మాది రాజాం ప్రాంతం. 25 ఏళ్ల క్రితం కుటుంబంతో ఆరిలోవ వచ్చాం. ఇక్కడ ఏడీపీ నిధులతో వేసిన లేఅవుట్ మాత్రమే ఉండేది. ఎలాంటి సౌకర్యాలు ఉండేవికాదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. ఇప్పుడు అన్ని సౌకర్యాలు లభించాయి. ఒకప్పుడు శివారున ఉండే ఆరిలోవ ఇప్పుడు నగరం చెంతన చేరింది.

– రెడ్డి గన్నిరాజు, ఆరిలోవ కాలనీ,

విద్యా ప్రదాతకు వందనం

- టీచింగ్ ఖాళీలు భర్తీ చేసిన ఘనత వైఎస్సార్‌దే
- మహిళా ఇంజినీరింగ్ కళాశాల స్థాపన కృషి
- ఏయూ ప్రగతికి బాటలు వేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి



వైఎస్ఆర్ ప్రారంభించిన అడ్వాన్స్ సైన్సెస్ భవనం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి, నూతన భవనాల నిర్మాణం, మహిళా ఇంజినీరింగ్ కళాశాల స్థాపనకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారు. మహానేత వైఎస్సార్ ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎందరో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంతో పాటు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకోవాలని ఆకాంక్షను సాకారం చేసింది.

నియామకాలు జరిపిన ఘనత

దశాబ్ద కాలానికి పైగా విశ్వవిద్యాలయాలలో నియామకాలు జరగక ప్రగతి కుంటు పడిన సమయంలో ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన ఐదు సంవత్సరాల కాలంలో ఏయూలో రెండు పర్యాయాలు ఆచార్యుల నియామకాలకు అనుమతి ఇచ్చిన ఘనత మహానేతకే దక్కింది. దార్శనికతతో పనిచేసే వైఎస్ఆర్ నిర్ణయాల ఫలితంగా నేడు ఏయూ ఉన్నతంగా అభివృద్ధి చెందుతోంది. బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, దీర్ఘ కాలంగా ఏయూలో పని చేస్తున్న వారికి టైం స్కేల్ వర్తింపు, వంటివెన్నో ఆయన హయాంలోనే జరిగాయి.

మహిళా విద్యకు పచ్చజెండా

మహిళా విద్యను ప్రోత్సహించే వైఎస్ రాజశేఖరరెడ్డి ఏయూలో ప్రత్యేకంగా మహిళా ఇంజినీరింగ్ కళాశాల స్థాపన చేయాలన్న వర్సిటీ పాలకుల నిర్ణయానికి వెంటనే ఆమోదముద్ర వేశారు. ప్రత్యేకంగా మహిళా ఇంజినీరింగ్ కళాశాల స్థాపనకు నాడు ఆయన ఇచ్చిన అనుమతులు నేడు వేలాది మంది మహిళా ఇంజినీర్లను తయారు చేయడానికి ఉపయుక్తంగా నిలిచింది.

అభివృద్ధికి నిధులు.. అధికారులకు స్వేచ్ఛ

విశ్వవిద్యాలయాల అభివృద్ధికి అవసరమైన బ్లాక్ గ్రాంట్‌ను ప్రతి సంవత్సరం పూర్తి స్థాయిలో వైఎస్సార్ అందించారు. ఈ నిధులతో ఏయూలో అడ్వాన్స్‌డ్ సైన్సెస్ భవన్, ప్లాటినం జూబ్లీ గెస్ట్ హౌస్ వంటివి నిర్మించారు. బీచ్ రోడ్డులో నిర్మించిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదించినది వైఎస్సారే.

విద్యను ఆస్తిగా అందించిన మహానుభావుడు



అన్ని వర్గాలకు విద్యను ఆస్తిగా అందించన మహానుభావుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం దేశానికే ఆదర్శం. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఆశయంతో ప్రవేశ పెట్టిన ఈ పథకం ఎందరినో ఉన్నతంగా ఎదగడానికి, కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఉపకరించింది.

– డాక్టర్ ఎం.కళ్యాణ్

అభివృద్ధికి చిరునామా..



ప్రజా నాయకుడిగా నిలిచిన వైఎస్ రాజశేఖరరెడ్డి నిత్యం సానుకూలంగా ఆలోచన చేస్తూ, ఆశావాదిగా నిలిచే వారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి పాలకులు చేసే ప్రతి ప్రతిపాదన స్వాగతిస్తూ సత్వరం అనుమతులు ఇచ్చేవారు. పెరుగుతున్న యువతను దృష్టిలో ఉంచుకుని నూతన విశ్వవిద్యాలయాలను స్థాపించి అవకాశాలు పెంచారు.

– డాక్టర్ టి.షారోన్‌రాజు, ఏయూ విద్యా విభాగాధిపతి

నగరంలో అయోధ్య రాముని పాదుకలు



అయోధ్య రాముడి పాదుకలు

మద్దిలపాలెం: అయోధ్య రామయ్య పాదుకలు దేశవ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం నగరానికి చేరుకున్నాయి. పాత వెంకోజీపాలెం రామాలయంలో కొద్ది గంటల పాటు భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రంపా రాము ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి పాదుకలను మంగళవాయిద్యాల మధ్య తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం, కాళ్ళ అప్పలరాజు, పీల కోటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎంవీపీ కాలనీలో..

ఏయూ క్యాంపస్: అయోధ్యలోని శ్రీరామ మందిరం నుంచి తెచ్చిన శ్రీరామ పాదుకలను ప్రజల సందర్శనార్థం ఎంవీపీ కాలనీ సెక్టారు 6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఉంచనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కార్యదర్శి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.

హిందూ సంప్రదాయ శాస్త్రాల బోధన అవసరం

మద్దిలపాలెం : బాలలకు హిందూ సంప్రదాయ శాస్త్రాలను బోధించేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిఫార్సు చేయాలని నగరానికి చెందిన వాస్తు, జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ కోరారు. ఈ మేరకు కమిషన్ సభ్యుడు గొండు సీతారాంను మద్దిలపాలెంలోని కార్యాలయంలో శుక్రవారం కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివరామ మాట్లాడుతూ ఆధునికత మోజులో మన సంప్రదాయాలను మరిచిపోకుండా ఈ బోధనలు ఎంతో దోహదపడతాయన్నారు. గురుకులంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వేద పురాణాలు, జ్యోతిష్యం, వాస్తు శాస్త్రాలపై అవగాహన కల్పిస్తున్నారని, అదే విధంగా బాలలకు బోధించాలని కోరారు. ఈ అంశాన్ని రాష్ట్ర కమిషన్ దృష్టికి తీసుకెళ్తానని సీతారాం హామీ ఇచ్చారు.

ఆలోచింపజేసిన సాంఘిక నాటికలు



మహర్షి నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు సాంఘిక నాటికలను ప్రదర్శించారు. వీఎండీఏ అధ్యక్షుడు రాజు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం తొలి నాటికగా గుంటూరు కాంట్రాపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ కళాకారులు మహర్షి నాటిక ప్రదర్శించారు. తప్పులు చేయడం మానవ సహజం.. కాకపోతే కొందరు తప్పు చేసిన వ్యక్తిని క్షమించి, అక్కున చేర్చుకుంటారని అనే ఇతివృత్తంగా మహర్షి నాటిక ప్రదర్శన సాగింది. అనంతరం ఇదే బృందం వసంతం నాటికను నేటి సమాజంలో చోటు చేసుకుంటున్న అంశాన్ని తీసుకుని చక్కని అభినయంతో ప్రదర్శించి కళాకారులు ఆకట్టుకున్నారు.

నేటి నుంచి సత్యభామ యువ నృత్యోత్సవాలు



రామలింగశాస్త్రి



తెన్నేటి శ్రావణి



సుకుమార్

మద్దిలపాలెం : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అంతర్జాతీయ స్థాయిలో సత్యభామ యువ నృత్యోత్సవాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు ఎన్ఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన నృత్య బృందాలు ఈ వేడుకల్లో పాల్గొంటున్నాయన్నారు.

విశిష్ట పురస్కారాల ప్రదానం

నాట్యరంగంలో నిష్ణాతులైన నాట్య కళాకారులకు 2023వ సంవత్సరానికి సత్యభామ పురస్కారాలు అందజేయనున్నారు. సిద్ధేంద్ర యోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి పద్మశ్రీ శోభానాయుడు స్మారక ఎక్స్‌లెన్స్ పురస్కారం, యునైటెడ్ అరబిక్‌కు చెందిన తెన్నేటి శ్రావణికి శోభానాయుడు యువ పురస్కారం, వేదాంతం లక్ష్మీనరసింహశాస్త్రికి యువ పురస్కారం, కూచిపూడికి చెందిన వేదాంతం వాగ్దేవి ప్రసాద్‌కు, చిత్ర సుకుమార్‌కు సత్యభామ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. సూడగాని గీతా నారాయణ్‌కు సత్యభామ ఎక్స్‌లెన్స్ అవార్డు, సత్యభామ బెస్ట్ టీచర్ అవార్డులను వి.వి.ఎస్.జగన్నాథరావు(కూచిపూడి), జి.మాయరాణి(మోహినీయాట్టం), ఎస్ఎన్‌వీ సత్యభామ(కూచిపూడి), బి.విజయ జ్యోతి పరమేష్(కూచిపూడి), ఎం.భారతి(భరతనాట్యం) స్వీకరించనున్నారని విక్రమ్ గౌడ్ తెలిపారు.

'సాంఖ్యాక శాస్త్ర విశ్లేషణలు ఉపయుక్తం'

ఏయూ క్యాంపస్: సమాచార సేకరణ, సాంఖ్యాక శాస్త్ర విశ్లేషణలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జనాభా పరిశోధన కేంద్రం, భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రెండో రోజు ఆయన సాంఖ్యాక శాస్త్ర గణాంకాల నిర్వహణ అంశంపై ప్రసంగించారు. నేడు సమాజంలో విస్తృతమైన సమాచారం అందుబాటులో ఉందని, దీనిని విశ్లేషించడం, సమాచారంగా మార్చడం ఎంతో ప్రధానమన్నారు. అనంతరం పీఆర్‌సీ సభ్యులకు ఏయూ సాంఖ్యాక శాస్త్ర విభాగంలో ప్రత్యక్ష శిక్షణ తరగతులు నిర్వహించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య బి.మునిస్వామి సాంఖ్యాక శాస్త్ర గణాంకాల తయారీలో ఎదరయ్యే సందేహాలను నివృత్తి చేశారు.

భాషా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



సదస్సులో పాల్గొన్న ఐఐఎం సిబ్బందితో సంచాలకులు

ఏయూ క్యాంపస్: భాషా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం చాలా అవసరమని అధికార భాష, ఆర్‌సీఏ అసిస్టెంట్ డైరెక్టర్ కాజిం అహ్మద్ అన్నారు. శుక్రవారం ఐఐఎం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న రెండు రోజుల హిందీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. భాష అనువాదాలు, సాంకేతిక పదాల తర్జుమా చేయడం వల్ల మెరుగైన భాష పరిజ్ఞానం ఏర్పడుతుందన్నారు. హిందీ భాష పరిజ్ఞానంపై ఉద్యోగులకు పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఆచార్య అమిత్ శంకర్, ఆచార్య టి.సునీత, డాక్టర్ భాస్కర్ రామ్‌లకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సదస్సు ముగింపు కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ భాష సామర్థ్యాలను పెంపొందించడానికి నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(పరిపాలన) జిలాని మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతులను గుర్తించండి



మాట్లాడుతున్న ఈడీ రామారావు

బీచ్ రోడ్డు: జిల్లాలో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న దళిత రైతులను గుర్తించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ సాయంతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న దళిత రైతులకు రూ.10వేలు విలువ చేసే విత్తనాలు, వాటర్ డ్రమ్ములు, జీవామృతం, పరదాలు, ఘనామృతం, ద్రవామృతం కిట్లు అందిస్తామన్నారు. విశాఖ జిల్లాకు 272, అనకాపల్లి జిల్లాకు 301, పాడేరు జిల్లాకు 64 కిట్లు మంజూరు చేశామన్నారు. వాటి అందజేసేందుకు అర్హులైన రైతులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మోహన్, సిబ్బంది భాస్కర్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్ యాదవ్

ఏయూక్యాంపస్ (విశాఖతూర్పు): గొర్రెలు, మేకలు పెంపకం దారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఏపీ గొర్రెల పెంపకం దారుల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్ జి.ప్రకాష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంపకం దారులు తమ సమస్యలను వివరించారు. ప్రతీ మండలంలోని బంజరు భూములను పెంపకందారులకు కేటాయించాలని, 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాదంలో, పిడుగుపడి మరణించిన కాపర్లకు రూ.10 లక్షలు పరిహారం కల్పించాలని, వివిధ సందర్భంలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ, జిల్లా గొర్రెలు పెంపకం దారుల సహకార యూనియన్ లిమిటెడ్ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస రావు, పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ ఎం.వి. కృష్ణారావు, తూర్పు గోదావరి జిల్లా చైర్మన్ డీవీవీ సత్యనారాయణ మూర్తి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, సహాయ సంచాలకులు, పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవాల పెంపకం, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన చర్యలు, శాస్త్రీయ యాజమాన్య విధానాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు సూచనలు చేశారు.

మార్కెట్‌లోకి మారుతీ ఇన్విక్టో కారు



కారు అవిష్కరిస్తున్న మంత్రి హర్షవర్ధన్ చౌహాన్, ఏసీపీ వివేకానంద్ తదితరులు

బీచ్ రోడ్డు: వాహన ప్రియులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న మారుతీ సుజుకి స్ట్రాంగ్ హైబ్రిడ్ సరికొత్త ఇన్విక్టో కారును శుక్రవారం దసపల్లాలోని వరుణ్ నెక్సా షోరూంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హిమాచల్‌ప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి హర్షవర్ధన్ చౌహాన్, దిశా పోలీస్ స్టేషన్ ఏసీపీ వివేకానంద పాల్గొని కారును నగర మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కారు రూ.24.8 లక్షల నుంచి రూ.28.4 లక్షల శ్రేణిలో విక్రయించనున్నారు. 3 వరుసల సీట్లు ఉన్న ఈ కారు జెటా+7 సీట్ల మోడల్, జెటా+8 సీట్లు, ఆల్ఫా + 7 సీట్ల మోడల్‌లో అందుబాటులో ఉన్నాయి. నెక్సా బ్లూ, మిస్టిక్ నైట్, మెజిస్టిక్ సిల్వర్, స్టెల్లార్ బ్రాంజ్ రంగుల్లో లభ్యమవుతుంది. ఇంటిలిజెంట్ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ సిస్టంతో 2 లీటర్ల పెట్రోల్ ఇంజన్, 10.1 అంగుళా స్మార్ట్ ప్లే మాగ్నమ్, డ్రైవ్ మోడ్ కలర్ థీమ్‌లతో కూడిన 7 అంగుళాల మల్టీ ఇన్ఫోటైన్‌మెంట్, 6 ఎయిర్ బ్యాగ్‌లతో పాటు తొలిసారి ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ ఫీచర్, మెమరీ ఆధారంగా పనిచేసే డ్రైవర్ సీటు ఈ కారులో ప్రత్యేకతలు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.డి.నజీమ్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, ఎండీ వరుణ్‌దేవ్ పాల్గొన్నారు.

ఘనంగా వైశ్యరాజు జ్యూయలర్స్ ఐదో వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న వైశ్యరాజు జ్యూయలర్స్ అధినేత వైశ్యరాజు పల్లుణరాజు

సీతమ్మధార: ఆశీలమెట్ట సంపత్ వినాయక ఆలయ సమీపంలో ఉన్న వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూం ఐదో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జ్యూయలర్స్ అధినేత వైశ్యరాజు పల్లుణరాజు కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. అనంతరం డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ ఐదేళ్లుగా తమను ఆదరిస్తున్న వినియోగదారులు, శ్రేయభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా 22 క్యారట్ల(916) బంగారు ఆభరణాలపై తరుగు, మజూరి లేదన్నారు. జీఎస్‌టీని కూడా కష్టమర్ల తరపున తామే చెల్లిస్తామన్నారు. 22 క్యారట్ల ఆభరణాలకు 24 క్యారట్ల బంగారం బులియన్ ధర చెల్లిస్తే చాలన్నారు. ఈ ఆఫర్ 9 గ్రాములుపైబడి కొన్న ఆభరణాలపై పొందవచ్చునన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు లేదని, జీఎస్‌టీ తామే చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్‌రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'శిష్టకరణాల కోసం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా'



ఎంపీ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందిస్తున్న అనూష పట్నాయక్, తదితరులు

బీచ్ రోడ్డు: శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేలా వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఓబీసీ కమిటీ మెంబర్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయనను ఏపీ శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, శిష్టకరణ సంఘం నాయకులు కలిశారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన ఆవశ్యకతను, ఇంత వరకు జరిగిన ప్రక్రియను, రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని ఎంపీకి వివరించారు. ఈ నేపథ్యంలో ఎంపీ స్పందిస్తూ శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేలా ఓబీసీ కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వచ్చే పార్లమెంట్ సమావేశంలో సాకారమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యకమంలో రాష్ట్ర శిష్టకరణ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జయితి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏకో వైజాగ్ సాధనే లక్ష్యం

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి గ్రీన్ వలంటీరీగా తయారై ఏకో వైజాగ్ సాధనే లక్ష్యంగా పని చేయాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జనపరెడ్డి రత్నం పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఈ మేరకు పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.